03-08-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - స్మృతి యాత్రకు సమయాన్ని ఇస్తూ ఉన్నట్లయితే వికర్మలు వినాశనమవుతూ ఉంటాయి, అందరి నుండీ మమకారము తొలగిపోతుంది, తండ్రి కంఠహారముగా అవుతారు"

ప్రశ్న:- గాడ్ ఫాదర్ ద్వారా పిల్లలైన మీరు ఏ రెండు మాటల చదువును చదువుకుంటారు? ఆ రెండు మాటలలో ఏ రహస్యము ఇమిడియుంది?

జవాబు:- గాడ్ ఫాదర్ మీకు ఇంత మాత్రమే చదివిస్తారు - హే ఆత్మలూ, 'శరీర భానాన్ని విడిచిపెట్టండి' మరియు 'నన్ను స్మృతి చేయండి' - ఈ రెండు మాటల చదువును ఎందుకు చదివించడం జరుగుతుందంటే, ఇప్పుడు మీరు ఈ పాత ప్రపంచములో పాత శరీరాన్ని తీసుకొనేది లేదు. మీరు కొత్త ప్రపంచములోకి వెళ్ళాలి. నేను మిమ్మల్ని నాతో పాటు తీసుకువెళ్ళేందుకు వచ్చాను, అందుకే దేహ సహితముగా అన్నింటినీ మర్చిపోతూ వెళ్ళండి.

పాట:- నీవే తల్లివి, తండ్రివి నీవే... (తుమ్హీ హో మాతా, పితా తుమ్హీ హో...)

ఓం శాంతి. మనమేమీ మనుష్యమాత్రుల ద్వారా శాస్త్రాలను వినడం లేదని సాలిగ్రామాలైన పిల్లలకు తెలుసు. దీనిని సత్సంగము అని అనరు, చదువు అని అంటారు. ఒకవేళ మనుష్యులను అడిగితే, మేము సత్సంగానికి వెళ్తున్నాము అని అంటారు లేక మేము కాలేజీకి వెళ్తున్నాము అని అంటారు. సత్సంగాలలో సాధు-సత్పురుషులు, విద్వాంసులు మొదలైనవారు వినిపించేవారిగా ఉంటారని తెలుసు. స్కూల్లో కూడా మనుష్యులే టీచర్లు, ప్రొఫెసర్లు మొదలైనవారిగా ఉంటారు, ఇక్కడున్నది మనిషి కాదు. వీరు అనంతమైన ఆత్మిక తండ్రి, వీరినే త్వమేవ మాతాశ్చ పితా... అని అంటారు. ఈ మహిమ దేవతలది కూడా కాదు, అలాగే బ్రహ్మా, విష్ణు, శంకరులది కూడా కాదు. ఈ మహిమ నిరాకార పరమపిత పరమాత్మునిది. నిరాకార పరమపిత పరమాత్మ ఈ శరీరాన్ని ధారణ చేసి పాత్రను అభినయిస్తున్నారని ఇప్పుడు పిల్లలకు తెలుసు. ఈ నిరాకార పరమపిత పరమాత్మ తప్ప ఇంకెవ్వరూ ఈ బ్రహ్మాకుమార-కుమారీలను చదివించలేరు. బ్రహ్మను కూడా జ్ఞాన సాగరుడు అని అనరు. వీరిని ప్రజాపిత అని అంటారు. జ్ఞాన సాగరుడు అని ఒక్క నిరాకార పరమపిత పరమాత్మనే అంటారు. వారే పతితులను పావనంగా తయారుచేసేవారు ఎందుకంటే జ్ఞాన సాగరుని ద్వారానే సద్గతి కలుగుతుంది. ఇది కొత్త విషయము. గీతలో శ్రీకృష్ణుని పేరును వేయడంతో దానిని ఖండించేసారు. మరి నాలెడ్జ్ ఫుల్ అయిన పరమపిత పరమాత్మ వచ్చి నాలెడ్జ్ ను ఇస్తారని ఇప్పుడు మనుష్యులకు ఎలా తెలియాలి. ఇది మనుష్యులు మర్చిపోతారు. శాస్త్రాలు మొదలైనవి ద్వాపరము ఆదిలోనే తయారవుతాయని కాదు. అలా కాదు. మొదట తండ్రి చిత్రాలు, మందిరాలు మొదలైనవి తయారవుతాయని, వాటితో భక్తి ప్రారంభమవుతుందని అర్థం చేయించడం జరుగుతుంది. భక్తి కూడా ఎంతోకాలం పరమాత్మదే జరగాలి ఎందుకంటే ఉన్నతోన్నతమైనవారు వారే. వారి పూజయే మొదట ప్రారంభమవుతుంది. పూజకు అర్హులు ఒక్క శివుడు మాత్రమే. బ్రహ్మా, విష్ణు, శంకరులు లేక జగదాంబ, జగత్పితలు పూజకు అర్హులు కారు. వీరందరినీ పూజ్యులుగా తయారుచేసేవారు ఒక్క తండ్రియే. వారికి భక్తి కూడా తప్పకుండా అధికముగా జరుగుతుంది. వీరు (బ్రహ్మ) అయితే అసలేమీ కాదు. వీరిలోకి పరమపిత పరమాత్మ రాకపోతే వీరికి పూజ ఏం జరుగుతుంది? సర్వుల సద్గతిదాత ఒక్క తండ్రియే. ఇది విచార సాగర మంథనము చేయవలసి ఉంటుంది. భక్తి ఎలా ప్రారంభమవుతుంది? శివబాబా అయితే విచార సాగర మంథనము చేయరు. పిల్లలే విచార సాగర మంథనము చేయాలి. బ్రహ్ముఖవంశావళి అయిన సరస్వతి కూడా విచార సాగర మంథనము చేయాలి. ఉన్నతోన్నతమైనవారు ఒక్కరే, వారే రాకపోతే ప్రపంచాన్ని పతితము నుండి పావనముగా ఎవరు తయారుచేస్తారు? మనుష్యమాత్రులందరూ పతితులుగానే ఉన్నారు. ఇప్పుడు శివబాబా రాకపోతే స్వర్గ వారసత్వాన్ని ఎవరు ఇస్తారు? నిశ్చయబుద్ధి కలవారిగా లేకపోతే విజయమాలలో కూర్చబడలేరు. సుపుత్రులైన పిల్లలు ఎల్లప్పుడూ కంఠహారముగా అవుతారు. ఈ బిడ్డ చాలా సుపుత్రుడు, ఆజ్ఞాకారీ అని తండ్రి కూడా సంతోషిస్తారు. 12-14 మంది పిల్లలు ఉండే తల్లిదండ్రులు కూడా ఎందరో ఉంటారు, వారిలో కొందరు కుపుత్రులుగా, కొందరు సుపుత్రులుగా కూడా ఉంటారు. పతిత-పావనుడైన తండ్రి తప్ప పతితుల ఉద్ధరణ ఇంకెవ్వరూ చేయలేరు. గంగా నదీ తీరంలో కూడా గంగా మందిరము ఉందని మీకు తెలుసు. కావున ఈ గంగ ఎవరు అనేది వారికి అర్థం చేయించాలి. ఈ గంగ ద్వారా పతితుల నుండి పావనులుగా అవ్వడానికి ఇది ఏమైనా శక్తియా లేక నీటి ద్వారా పావనులుగా అవుతారా? తండ్రి అంటారు - గంగ పతిత-పావని కాదు. యోగము ద్వారా తప్ప ఎవ్వరూ పావనులుగా అవ్వలేరు, అందుకే మీరేమీ గంగా స్నానాలు

చేయకూడదు. యోగము అంటే అర్థము స్మృతి. బుద్ధి యోగమును జోడించాలి. వారు ఎన్నో యోగ ఆసనాలు మొదలైనవి చేస్తారు, అనేక రకాల హఠయోగాలను చేస్తారు, వాటిని యోగము అని అనరు. మాతలకు, అబలలకు హఠయోగము గురించి ఏమి తెలుసు?

మనుష్యులు స్కూల్లో చదువుకుంటారు, అందులో కష్టాలు పడే విషయమేదీ ఉండదు. ఏదో ఒక పరీక్షను పాసవుతారు. ఈ పరీక్షను పాసై ఈ విధంగా అవుతాము అని వారికి తెలుసు. ఇక్కడ కూడా మీకు తెలుసు - ఇది కూడా పరీక్షయే, గాడ్ ఫాదర్ చదివిస్తారు. వారు పతిత-పావనుడు. మీది గాడ్-ఫాదర్లీ స్టూడెంట్ లైఫ్ (ఈశ్వరీయ విద్యార్థి జీవితము). తండ్రి పతితుల నుండి పావనులుగా ఎలా తయారుచేస్తారు? వారు అంటారు - హే ఆత్మలూ, ఈ శరీర భానాన్ని విడిచిపెట్టండి. ఈ పాత శరీరాన్ని విడిచిపెట్టాలి. మొట్టమొదట మీ శరీరము తెల్లగా ఉండేది, ఇప్పుడు ఇనుప యుగానికి చెందినదిగా అయిపోయింది. ఇప్పుడు మీరు కొత్త శరీరాన్ని ఇక్కడ తీసుకొనేది లేదు ఎందుకంటే ఇక్కడ పంచ తత్వాలు తమోప్రధానముగా ఉన్నాయి. ఇప్పుడు నేను పిల్లలైన మిమ్మల్ని నాతోపాటు తీసుకువెళ్తాను. కల్పపూర్వము కూడా తీసుకువెళ్ళాను. నేను కాలుడికే కాలుడిని. అందరినీ తిరిగి తీసుకువెళ్తాను. ఆ తర్వాత మిమ్మల్ని అమరపురిలోకి పంపిస్తాను. ఇది మృత్యులోకము, ఛీ-ఛీ ప్రపంచము, అందుకే సంగమయుగానికి 100 సంవత్సరాలు కావాలి. మిగిలిన యుగాలన్నీ 1250 సంవత్సరాలు కలిగియుంటాయి. ఈ చివరిలోని సంగమయుగపు ఆయువు చాలా తక్కువ ఉంటుంది. ఏ విధముగా బ్రాహ్మణుల పిలక చిన్నగా ఉంటుందో, అలాగే సంగమయుగపు ఆయువు కూడా తక్కువగా ఉంటుంది. ఇక తర్వాత ఈ ప్రపంచము అంతమైపోతుంది, అప్పుడు కొత్త ఇళ్ళు మొదలైనవి నిర్మించడం ప్రారంభిస్తారు. అందులోకి మొదట శ్రీకృష్ణుడు వస్తారు. వారు మహళ్ళు మొదలైనవి తయారుచేయించడం పట్ల అభిరుచి కలిగి ఉంటారు. సోమనాథ్ మందిరాన్ని తయారుచేయించినవారు ఎంతో అభిరుచి కలిగినవారు అయి ఉంటారు కదా. బిర్లా కూడా ఇటువంటి అభిరుచి కలిగినవారు, వారు ఎంత మంచి మందిరాన్ని నిర్మించారు! నంబరువన్ పూజ్యులు శివబాబా, తర్వాత భక్తి మార్గములో కూడా మొదట సోమనాథ్ మందిరము తయారవుతుంది. అది కూడా కొంత సమయం తర్వాతే తయారవుతూ ఉండవచ్చు. అప్పుడు పూజ ప్రారంభమవుతుంది. ఇప్పుడు ఘోర అంధకారము ఉంది. రాత్రి పూర్తయి మళ్ళీ పగలు వస్తుంది.

తండ్రి అంటారు, నేను రాత్రి మరియు పగలుకు మధ్యలో వస్తాను. మహా భారీ యుద్ధము కూడా ఉంది. యాదవుల కడుపు నుండి ఎటువంటి వస్తువులు వెలువడ్డాయంటే, వాటి ద్వారా మొత్తం కులము యొక్క వినాశనం జరిగింది అని వ్రాయబడి ఉంది. తప్పకుండా వినాశనం కొరకు ఏర్పాట్లు చేస్తున్నారన్నది మీరు చూస్తున్నారు. ఎవరో ప్రేరకులు ఉన్నారు అని వారు భావిస్తారు. ఇరువురి వినాశనం కొరకు బాంబులు తయారుచేసి పెట్టుకున్నారు. ఆపదలు కూడా రానున్నాయి. మీరైతే ప్రాక్టికల్ గా చూస్తున్నారు, స్థాపన కూడా జరుగుతోంది, వినాశనము కూడా ఎదురుగా ఉంది. ఒకవేళ ఎవరైనా వినాశనాన్ని చూడకపోయినా, అచ్ఛా, వైకుంఠాన్ని అయితే చూస్తారు కదా. బాగా చదువుకొని తండ్రి నుండి పూర్తి అనంతమైన వారసత్వాన్ని తీసుకోవాలి. మిమ్మల్ని సాకారుడు చదివించరు. శాస్త్రాలు మొదలైనవాటి విషయము లేదు. ఇక్కడ జ్ఞాన సాగరుడు స్వయంగా చదివిస్తున్నారు. మీరు స్వయాన్ని దేహీగా భావిస్తూ తండ్రిని స్మృతి చేస్తారు. భగవానువాచ - తమ పిల్లల కొరకు వినిపిస్తున్నారు - నేను పిల్లలైన మీ సమ్ముఖములో ఉంటాను. ఎవరైతే నా పిల్లలుగా అవుతారో, వారిలో కొందరు సవతి పిల్లలు, కొందరు స్వంత పిల్లలు. స్వంత పిల్లలకే వారసత్వపు హక్కు ఉంటుంది. సంశయ బుద్ధి కలవారిని సవతి పిల్లలు అని అనడం జరుగుతుంది. వారికి వారసత్వం లభించదు. వారు ఇక పురుషార్థానుసారముగా ప్రజలలోకి వెళ్ళిపోతారు. స్వంత పిల్లలు రాజ్యంలోకి వస్తారు. వారు తండ్రిని ప్రేమిస్తారు, తండ్రి వారిని ప్రేమిస్తారు. నీపై బలిహారమవుతాను, అర్పణ అవుతాను అని పాడుతారు కదా. తండ్రి అంటారు, నన్ను స్మృతి చేసినట్లయితే నేను నీకు సహాయం చేస్తాను. పిల్లలు ధైర్యాన్ని ఉంచితే ఖుదా సహాయం చేస్తారు. మిగిలినవారందరి నుండి బుద్ధియోగాన్ని తెంచి ఒక్కరితోనే జోడించాలి. మీరు అంటారు - మేము బాబాకు చెందినవారము, ఇదంతా బాబాదే. బాబాకు మనం పనికిరానివి ఇచ్చి వాటికి బదులుగా స్వర్గము యొక్క అనంతమైన రాజ్యాధికారపు వారసత్వాన్ని తీసుకుంటాము. ఈ పాత దేహము పట్ల మనకు మమకారము లేదు. ఇది తమోప్రధాన, రోగీ శరీరము. మన వద్ద ఇంకేమి ఉంది? మనుష్యులు మరణించినప్పుడు సర్వస్వమూ దూరమైపోతుంది. అప్పుడు వారి వద్ద ఉన్నదంతా కాటికాపరికి ఇచ్చేయడం జరుగుతుంది. మేము సర్వస్వాన్ని మీకు ఇస్తాము. మమకారాన్ని అంతం చేసేందుకు మనం నిరంతరం బాబాను స్మృతి చేసే పురుషార్థము చేస్తాము. మాయ మళ్ళీ విఘ్నాలను కలిగిస్తుంది, అందుకే మెల్లమెల్లగా నా స్మృతికి మీరు ఎంతగా సమయాన్ని ఇస్తూ ఉంటారో, అంతగా వికర్మలు వినాశనమవుతాయి. అటువంటివారే నా కంఠహారముగా అవుతారు. ఎంత సహజంగా అర్థం చేయిస్తారు. తండ్రి అర్థం

చేయిస్తారు, ఈ రథము కూడా డ్రామా అనుసారముగా నాకు నిశ్చితం చేయబడింది. నేను ఇంకెవరిలోకీ రాలేను కూడా. మీరు కూడా అంటారు - బాబా, కల్పపూర్వము కూడా మేము మిమ్మల్ని ఇదే ఇంటిలో, ఇదే డ్రస్ లో కలుసుకున్నాము మరియు మీ నుండి వారసత్వాన్ని తీసుకున్నాము. ఇది ఎంత సహజము.

తండ్రి అంటారు, కేవలం నన్ను స్మృతి చేయండి, ఇంకెటువైపూ బుద్ధి వెళ్ళకూడదు. గుర్తుంచుకోండి - అంత్యకాలములో కొడుకును తలచుకున్నట్లయితే లేక ఇంకెవ్వరినైనా తలచుకున్నట్లయితే అక్కడకు వెళ్ళి జన్మ తీసుకోవలసి వస్తుంది. ఎక్కడా మమకారము ఉండకూడదు. అంత్యకాలములో ఎవరైతే స్త్రీని స్మరిస్తారో... తండ్రి పతితులను పావనంగా తయారుచేసేందుకు వస్తారు, వారికి ఎంత మహిమ చేస్తారు. ఏక్ ఓంకార్... వారికి ఒకే పేరు ఉంది. పేరు మారేందుకు వారికి వేరే శరీరమే లభించదు. మీరైతే 84 జన్మలను తీసుకుంటారు కావున పేర్లు కూడా 84 ఉంటాయి. తండ్రి మహిమలో - నిర్భయ్, నిర్వైర్, అకాలమూర్త్... అని గానం చేస్తారు. వారు కాలుడికే కాలుడు, వారిని మృత్యువు కబళించలేదు. నేను అందరినీ ముక్తిధామానికి తీసుకువెళ్తాను. నేను నిర్వైర్, నాకు ఎవరితోనూ వైరము లేదు. నేను అకాలమూర్తిని, అయోనిజుడను. నేను జనన-మరణాలలోకి రాను. వారి మహిమను ఎంతగా గానం చేస్తారు. దుఃఖహర్త, సుఖకర్త... అని కూడా అంటూ ఉంటారు. వారు కలియుగ దుఃఖాలను హరిస్తారు. సత్యయుగ సుఖాలను ఇస్తారు. భారత్ లో సత్యయుగములో జీవన్ముక్తి ఉండేదని పిల్లలకు తెలుసు. మిగిలిన ఆత్మలందరూ శాంతిధామంలో ఉండేవారు, ఇది గుర్తుకొస్తుంది కదా. కావున తప్పకుండా తండ్రి ఎప్పుడైతే సంగమయుగములో వస్తారో, అప్పుడే అందరినీ శాంతిధామానికి తీసుకువెళ్తారు మరియు మిమ్మల్ని మళ్ళీ సుఖధామానికి పంపిస్తారు. ఇది ఎంత సహజమైన విషయము. కానీ మాయ ఎటువంటిదంటే, ఇక్కడి నుండి బయటకు వెళ్ళగానే మర్చిపోతారు. గర్భ జైలులో ధర్మరాజు ద్వారా మీకు శిక్షలను ఇప్పిస్తాను, అప్పుడు ఆర్తనాదాలు చేస్తారు - మేము క్షమించమని వేడుకుంటున్నాము, మళ్ళీ ఇటువంటి పాపాలు చేయము అని. బయటకు రాగానే మళ్ళీ పాపాలు చేయడం మొదలుపెడతారు. ఇది ఉన్నదే మాయ రాజ్యము. సత్య, త్రేతా యుగాలలో మాయ ఉండదు. అక్కడైతే సుఖమే సుఖము ఉంటుంది. ఇప్పుడు మీరు చదువుకుంటున్నారు. ఇందులో ఇల్లు-వాకిళ్ళను వదలవలసిన విషయము లేదు. తండ్రి అంటారు - దేహ సహితముగా సర్వస్వాన్ని మర్చిపోండి. ఇది మీ అనంతమైన సన్యాసము. ఆ సన్యాసులది హద్దులోని సన్యాసము. అడవుల్లోకి వెళ్ళి మళ్ళీ పట్టణాలలోకి తిరిగివస్తారు. ఎంత గొప్ప-గొప్ప పేర్లు పెట్టించుకుంటారు. తండ్రి అంటారు, నేను ఎంత సహజముగా అర్థం చేయిస్తాను. వృద్ధ మాతలు ఎంతమంది ఉన్నారు, మాకు ధారణ జరుగడం లేదు అని అంటారు. అచ్చా, పరమాత్మ చదివిస్తున్నారు అని అయితే తెలుసు కదా? వారు చెప్తున్నారు, కేవలం నన్నే స్మృతి చేయండి. ఇందులో కష్టమేమీ లేదు. ఇప్పుడు మనం 84 జన్మల చక్రాన్ని పూర్తి చేసాము. ఇది స్వదర్శన చక్రము. ఆత్మకు చక్రము యొక్క దర్శనము కలుగుతుంది. ఇక్కడే నిరోగీ శరీరము తయారవుతుంది. చక్రాన్ని తెలుసుకోవడం ద్వారా మీరు ఉన్నత పదవిని పొందుతారు, అందుకే బాబా అంటారు, స్వదర్శన చక్రధారులుగా అవ్వండి. ఎంత సహజంగా అర్థం చేయిస్తారు! ఇది సహజమైన స్మృతి, సహజమైన సృష్టి చక్రము, ఇందులో ఏ కష్టమూ లేదు. ఇది సత్యమైన సంపాదన. మిగిలిన ధనము, సంపద మొదలైనవన్నీ అంతమైపోనున్నాయి, అన్నీ దూరమైపోతాయి. సముద్రము ఉప్పొంగనున్నది. ప్రకృతి వైపరీత్యాలు కూడా రానున్నాయి. భారత్ సత్యఖండముగా ఉండేది, అప్పుడు ఇంకే ఖండమూ ఉండేది కాదు. భారత్ శివబాబా జన్మభూమి. ఇది అన్నింటికన్నా పెద్ద తీర్థ స్థానము. భారత్ లోనే సోమనాథ మందిరము ఎంత బాగా తయారుచేయబడి ఉంది! ఇప్పుడైతే లెక్కలేనన్ని తయారుచేస్తారు.

బాబా అంటారు, ఈ సమయంలో వివాహం చేసుకోవడమంటే పూర్తిగా సర్వనాశనమే. శివబాబాతో నిశ్చితార్థము జరుపుకోవడమంటే పూర్తిగా సుసంపన్నం అవ్వడం వంటిది. శివబాబా ప్రియుడు కూడా, వారు స్వర్గములోకి పంపిస్తారు. మీరు ఇక్కడకు వచ్చారు, మనము ఇక్కడ తప్పకుండా నరుని నుండి నారాయణునిగా, నారి నుండి లక్ష్మిగా అవుతామని మీకు తెలుసు. పురుషులు వెళ్ళి మళ్ళీ అక్కడ పురుషులుగానే అవుతారని కాదు. మారుతూ ఉంటారు. ఒక్కో శరీరము పురుషునిది, ఒక్కోటి స్త్రీది. తర్వాత సత్యయుగము నుండి త్రేతాయుగముగా ఎలా అవుతుంది - ఇది కూడా అర్థం చేయించడం జరిగింది. ఇప్పుడు పిల్లలైన మిమ్మల్ని నాలెడ్జ్ ఫుల్ గాడ్ ఫాదర్ చదివిస్తారు. మనుష్యులు తండ్రిగా, టీచరుగా, సద్గురువుగా అవ్వలేరు. తండ్రిగా మరియు టీచరుగా అవ్వగలరు కానీ గురువుగా అవ్వలేరు. అది కూడా దైహిక విద్యకే టీచరుగా అవ్వగలరు. ఈ బాబా అయితే పూర్తిగా స్వర్గాధిపతులుగా తయారుచేస్తారు. ఏ విషయమైనా అర్థం కాకపోతే వెయ్యి సార్లు అడగండి. అచ్చా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. సుపుత్రులుగా, ఆజ్ఞాకారులుగా అయి విజయమాలలో కూర్చబడాలి. తండ్రికి మీ వద్ద ఉన్న పనికిరానివాటిని ఇచ్చి, బలిహారమై, అందరి నుండి మమకారాన్ని తొలగించివేయాలి.

2. అంత్యకాలములో ఒక్క తండ్రే గుర్తు ఉండాలి, దీని కొరకు మిగిలిన అందరి నుండి బుద్ధియోగాన్ని తెంచి నిరంతరము తండ్రి స్మృతిలో ఉండేందుకు పురుషార్థము చేయాలి.

వరదానము:- సర్వ ఖజానాలను స్వయములో ఇముడ్చుకొని, నిరాశ మరియు ఈర్ష్య నుండి ముక్తులుగా ఉండే సదా ప్రసన్నచిత్త భవ

బాప్ దాదా పిల్లలందరికీ సమాన రూపంలో అన్ని ఖజానాలను ఇచ్చారు, కానీ కొందరు ఆ ప్రాప్తులను స్వయములో ఇముడ్చుకోలేకపోతారు మరియు వాటిని సమయానికి కార్యములో వినియోగించడం రాదు, అందుకే సఫలత కనిపించదు, అప్పుడు స్వయముతో నిరాశ చెందుతారు, బహుశా నా భాగ్యము ఇలాగే ఉందేమో అని ఆలోచిస్తారు. వారికి ఇతరుల విశేషతలు మరియు భాగ్యాన్ని చూసి ఈర్ష్య కలుగుతుంది. ఇలా నిరాశ పడేవారు మరియు ఈర్ష్య పడేవారు ఎప్పుడూ ప్రసన్నంగా ఉండలేరు. సదా ప్రసన్నులుగా ఉండాలంటే ఈ రెండు విషయాల నుండి ముక్తులుగా ఉండండి.

స్లోగన్:- స్వార్థము లేకుండా సత్యమైన హృదయముతో సేవ చేసేవారే స్వచ్ఛమైన ఆత్మలు.